సాక్షి
నారాయణపేట
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



స్వయం సమృద్ధి
మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యువెలరీ తయారీలో శిక్షణ ఇస్తున్నారు.
వివరాలు 8లో ▸



9 యూనిట్లలో విద్యుదుత్పత్తి
జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి పుంజుకుంది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /24.7

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఈదురుగాలులతో అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెసర క్వింటా రూ.7,809

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం పెసర క్వింటాకు గరిష్ఠంగా రూ.7,809, కనిష్ఠంగా రూ.4,868 ధర పలికింది. రైతుల నుంచి 2,310 బస్తాలను కొనుగోలు చేశారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



నారాయణపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిసి నియోజకవర్గంలో చేపట్టే పలు అభివృద్ధి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ నెల 23న జిల్లా ఆస్పత్రి ప్రారంభోత్సవం, మెడికల్ కళాశాల శంకుస్థాపన, నారాయణపేట మండలం బోయినపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, అమృత్ పథకం, మున్సిపల్ పార్క్ ప్రారంభోత్సవం, ధన్వాడ మండల తహసీల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి



నారాయణపేట: పనితీరు మెరుగు పర్చుకోకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాలపై డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 2023 – 24 బ్యాంకు లింకేజీ లక్ష్యం ఎంత, ఇప్పటి వరకు ఎంత చేరుకున్నారని ప్రశ్నించారు. జిల్లాలోని నలుగురు డీపీఎంలు ప్రతి గ్రామసమాఖ్య సంఘాన్ని పరిశీలించి ఆయా సంఘాలలో పొదుపు, అప్పుల వివరాలతో పాటు కార్యక్రమాల నివేదికను తయారు చేసి తనకు అందజేయాలని ఆదేశించారు. మక్తల్ మండలంలో మొత్తం ఎన్ని గ్రామైక్య సంఘాలు ఉన్నాయని, అందులో ఎంతమంది పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మక్తల్, కోస్గి పరిధిలోని సీసీల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శాఖ పరంగా ముఖ్యంగా మద్దూర్ కోస్గి మండలాల్లో చాలా తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అకౌంట్స్ నిర్వహణ సరిగ్గా ఉండేలా చూసుకోవాని ఆదేశించారు. నారాయణపేట, మక్తల్, కొస్గి మున్సిపాలిటీల పరిధిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మొగులప్ప, అడిషనల్ డీఆర్డీఓ అంజయ్య పాల్గొన్నారు.

రుణమాఫీలో జాప్యానికి బీఆర్‌ఎస్సే కారణం



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డీసీసీబీ బ్యాంకర్ల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీబీ పరిధిలో రుణమాఫీపై అధికారులతో సమీక్షించారు. బ్యాంకు పరిధిలో రుణాల మాఫీ వి వరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఈఓ లక్ష్మయ్యను విచారించి సాంకేతిక లోపం తదితర కారణాలు చెప్పకండి.. ఆదివారం ఉదయం 10.30 గంటలకల్లా రుణాల మాఫీకి సంబంధించిన ఫైళ్లు తీసుకుని హైదరాబాద్‌కు రావాలని ఆదేశించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైతు రుణమాఫీలో సాంకేతిక లోపాలు తలెత్తి జాప్యానికి కారణమైందన్నారు. ముందుచూపు లేకే మాజీ సీఎం కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల పైచిలుకు అప్పు చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ సమయానికి రూ.70 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ఇప్పుడు అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. చిన్న చిన్న కారణాలతో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ రుణమాఫీ చేస్తామన్నారు.

ఛీ.. కాలేదు!

రుణమాఫీలో కోత.. రైతులకు తప్పని వ్యథ



పెబ్బేరు మండలంలోని గుమ్మడంలో రైతువేదిక వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- 5.49 లక్షల మందిలో 3.36 లక్షల మందికే వర్తింపు
- అర్హులైన రైతుల్లో పెల్లుబికుతున్న ఆగ్రహావేశాలు
- వ్యవసాయ అధికారులు, బ్యాంక్‌ల చుట్టూ ప్రదక్షిణలు

ఉమ్మడి జిల్లాలో పంట రుణాలు తీసుకున్న రైతులు 5,49,108	
రుణమాఫీ కావాల్సిన సొమ్ము రూ.3,202.76 కోట్లు	మాఫీ వర్తించిన రైతులు 3,36,875
మాఫీ అయిన సొమ్ము రూ.2,787.87 కోట్లు	పెండింగ్‌లో ఉన్న రైతులు 2,12,233

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పంట రుణాల మాఫీ ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం మూడు విడతల్లో రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేసింది. ఉమ్మడి పాలమూరు పరిధిలోని ఐదు జిల్లాల్లో పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని తెలుస్తోంది. నిబంధనల కొర్రీలతో వేలాది మంది రైతులు మాఫీకి దూరం కాగా.. అర్హులైన లక్షలాది మందికి సైతం వర్తించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం భారీగా కోత పెట్టడంతోనే తమకు అన్యాయం జరిగిందని రుణమాఫీకి నోచుకోని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

2 లక్షలకు పైగా రైతులకు దూరం..

2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ లోపు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిర్దేశిత కాలంలో ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో సుమారు 5,49,108 మంది రైతులు రూ.3,203 కోట్ల పంట రుణాలు తీసుకున్నట్లు రైతు సంఘాల అంచనా. అయితే ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన ప్రక్రియలో 3,36,875 మందికే రుణమాఫీ వర్తించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన సుమారు 2,12,233 మంది రుణమాఫీకి దూరమైనట్లు తెలుస్తోంది. వీరికి దాదాపు రూ.414.89 కోట్లు రుణం మాఫీ కావాల్సి ఉంది.

తొలి నుంచీ గోప్యత.. విమర్శల వెల్లువ

రేషన్‌కార్డు లేకపోవడం, ఆధార్‌లోని పేరు బ్యాంక్ ఖాతాలో పేరు సరిపోలకపోవడం, రుణాలు రీషెడ్యూల్ చేసుకోవడం, ఆదాయపు పన్ను చెల్లించడం, కుటుంబ నిర్ధారణ జరగకపోడం, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం వంటి కారణాలతో వేలాది మంది రుణమాఫీకి అనర్హులుగా మారినట్లు తెలుస్తోంది. పీఎం కిసాన్ మెలిక సైతం ప్రధాన కారణమని రైతు సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. వీటితో పాటు రుణమాఫీకి సంబంధించి మొదటి నుంచీ అధికారులు గోప్యత పాటిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జాబితా తాము తయారు చేయలేదని అటు వ్యవసాయ శాఖ అధికారులు, ఇటు బ్యాంకర్లు చెబుతున్నారు. పై నుంచే జాబితా వచ్చిందంటూ దాట వేస్తున్నారు. అర్హులైనా తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని వేలాది మంది రైతులు నిత్యం చక్కర్లు కొడుతున్నా.. మాకు తెల్వదు, వారిని అడగండి అంటూ బ్యాంక్, వ్యవసాయాధికారులు ఇరువురు దోబూచులాడుతుండడంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ఆధార్‌కార్డు తప్పగా ఎంట్రీ చేశారు..



నేను పీఏపీఎస్‌లో రూ.1.50 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నా. వడ్డీ రూ.13 వేలతో కలిపి మొత్తం రూ.1.63 వేలు అయ్యింది. బ్యాంకు అధికారులు నా వివరాల్లో ఆధార్‌కార్డు నంబర్‌ను తప్పుగా ఎంట్రీ చేయడంతో రుణమాఫీ వర్తించలేదు. ప్రస్తుతం బ్యాంకు అధికారులు వివరాలు సరి చేశారు. అయినా కూడా రుణం మాఫీ కాలేదు. జిల్లా అధికారులు స్పందించి నాకు రుణమాఫీ వర్తింప చేయాలి.

– కాశప్ప, రైతు, నేరడగం, మాగనూర్ మండలం

ఒకే రేషన్‌కార్డు ఉండడంతో ఇవ్వలే..



నాకు 8 ఎకరాల భూమి ఉంది. భార్య పేరు మీద రూ.1.30 లక్షలు, నా పేరు మీద రూ.1.80 లక్షలు మాగనూర్ ఏపీజీవీబీలో క్రాప్‌లోన్ తీసుకున్నాం. మాకు ఒకే రేషన్ కార్డు ఉండటంతో ఇద్దరిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. విషయాన్ని స్థానిక వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఇద్దరికి కలిపి రూ.2 లక్షలు మాత్రమే రుణం ఉండాల్సి ఉందని, ఆపైన డబ్బు చెల్లిస్తే మాఫీ వర్తింపజేస్తాం అంటున్నారు. సీఎం సారు స్పందించి మాఫీ చేయాలి.

– అశోక్‌గౌడ్, రైతు, మాగనూర్

ఆశలపై నీళ్లు చల్లారు..



నాకు 4 ఎకరాల భూమి ఉంది. 2018లో మక్తల్ ఎస్‌బీఐలో రూ.1.80లక్షల అప్పు తీసుకున్నా. మూడో విడతలో మాఫీ అవుతుందని చెబితే ఎంతో ఆశగా ఎదురుచూశా. వడ్డీతో కలిపి రూ.1.95లక్షలు అయ్యిందని చెప్పారు. ప్రతి సారి రెన్యూవల్ చేస్తూ వచ్చా. ఇప్పుడేమో నాకు రుణం మాఫీ కాలేదు. బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదు.

– రాంలింగం, రుద్రసముద్రం, మక్తల్ మండలం

రూ.2 లక్షలకు పైవారి పరిస్థితి ఏమిటో..

మూడో విడతకు సంబంధించి మండలాల వారీగా జాబితా ఇంకా అందలేదని తెలుస్తోంది. ఇప్పటివరకు రెండు విడతల్లో మాఫీ అయిన వారిలో వందలాది మంది ఖాతాల్లో డబ్బులు జమకానట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు సైతం రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా డీసీసీబీ పరిధిలో, ఇతర బ్యాంకుల్లో రెన్యూవల్‌లో చోటుచేసుకున్న మాయాజాలంతో రూ.2 లక్షలకు పైగా బకాయి పడ్డామని.. దీంతో తమకు రుణమాఫీ కాలేదని వాపోతున్నారు. రూ.2 లక్షలకు పైన ఉన్న సొమ్ము ఇటీవల చెల్లించామని.. తమను అర్హులుగా ప్రకటించి మాఫీ చేయాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ బ్యాంకర్లతో జరిగిన సమీక్షలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రూ.2 లక్షలకు పైగా పంట రుణాలు తీసుకున్న వారికి సైతం రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తుందని.. మిగతా సొమ్మును సదరు రైతులు బ్యాంక్‌లకు చెల్లించాలని చెప్పడంతో వారికి ఊరట లభించనున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి పాలమూరులో జిల్లాల వారీగా వివరాలు..					రుణమాఫీకి నోచుకోని రైతుల వివరాలు (అంచనా)..	
జిల్లా	రు.మా.కా.రై.	రై.తీ.పం.రు. (రూ.కో.)	మూ.వి.మా.అ.రై.	మా.అ.రు. (రూ.కో.)	పెండింగ్ రైతులు	మాఫీ కావాల్సిన సొమ్ము(రూ. కోట్లలో)
మహబూబ్‌నగర్	1,23,102	735.82	72,113	582.13	50,989	153.69
నాగర్‌కర్నూల్	1,47,500	935.40	98,633	823.71	48,867	111.69
జోగుళాంబ గద్వాల	95,199	501.72	51,188	440.73	44,011	60.99
వనపర్తి	88,948	492.20	56,187	438.13	32,761	54.07
నారాయణపేట	94,359	537.62	58,754	503.17	35,605	34.45

రు.మా.కా.రై.: రుణమాఫీ కావాల్సిన రైతులు.. రై.తీ.పం.రు.(రూ.కో.): రైతులు తీసుకున్న పంట రుణం (రూ.కోట్లలో..)..
మూ.వి.మా.అ.రై.: మూడు విడతల్లో మాఫీ అయినరైతులు.. మా.అ.రు.(రూ.కో.): మాఫీ అయిన రుణం (రూ.కోట్లలో..)



గో బ్యాక్.. డౌన్ డౌన్

మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకున్న సరిత వర్గీయులు



గద్వాలలో మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న సరిత వర్గీయులు

- నాయకులు, పోలీసుల మధ్య తోపులాట.. ఉద్రిక్తత
- కార్యకర్తల నిరసనలతో అట్టుడికిన గద్వాల


గద్వాల/ గద్వాల క్రైం: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వైఖరిని నిరసిస్తూ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు చేపట్టిన ఆందోళనతో గద్వాల అట్టుడికింది. జూపల్లి గో బ్యాక్.. డౌన్ డౌన్ అంటూ మంత్రికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అప్పటికే పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు సరిత వర్గీయులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, సరిత వర్గీయులకు మధ్య వాగ్వాదం, తీవ్రస్థాయిలో తోపులాట చోటుచేసుకుంది. దీంతో గద్వాలలో ఒక్కసారిగా వాతావరణం ఉద్రిక్తంగా మారిపోయింది. నిరసనలు, నినాదాలు, వివాదాల మధ్య మంత్రి జూపల్లి ప్రాజెక్టు సందర్శన సాగింది.

అసలేం జరిగింది..

శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం గద్వాలకు వచ్చారు. మంత్రి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి రాక కోసం వేచి చూశారు. అయితే మంత్రి జూపల్లి ఎమ్మెల్యేతో కలిసి ప్రాజెక్టుల సందర్శనకు కాన్వాయ్‌తో బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న సరిత వర్గీయులు స్థానిక ఈదమ్మ గుడి దగ్గర మంత్రి కాన్వాయ్‌కు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పా ర్టీలోని పాత, కొత్త తరం నాయకులను, ఇరువర్గాలను సమన్వయం చేయాలని, అందుకు సరిత నివాసానికి వచ్చి అందరం కలిసి ప్రాజెక్టుల సందర్శన చేపట్టాలని పలువురు సీనియర్ నాయకులు మంత్రికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే.. తర్వాత మళ్లీ వస్తానని చెబుతూ కాన్వాయ్‌ను ముందుకు సాగించారు. దీంతో కోపోద్రిక్తులైన కార్యకర్తలు మంత్రి జూపల్లి కాన్వాయ్‌ని స్థానిక చింతలపేట కాలనీలో అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు సరిత వర్గీయులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. సుమారు అరగంట పాటు పోలీసులకు, సరిత వర్గీయులకు మధ్య తోపులాట జరిగింది. చివరకు మంత్రి జూపల్లి జోక్యం చేసుకుని సరిత వర్గీయులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అందుకు ససేమిరా అనడంతో మంత్రి జూపల్లి గత్యంతరం లేక తన కాన్వాయ్‌ను సరిత నివాసానికి మళ్లించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కొంత అసహనానికి గురైనా తన వర్గీయులతో కలిసి ర్యాలంపాడు రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారు. సరిత నివాసం దగ్గర అప్పటికే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తల నిరసనల మధ్య మంత్రి జూపల్లి కృష్ణారావు.. సరితతో చర్చించారు. సరిత వర్గీయులు ఎమ్మెల్యే వైఖరిపై ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోవడానికి, పార్టీ కండువా కప్పుకోవడానికి సిగ్గు పడుతున్నారని మంత్రి దృష్టి తెచ్చారు.

కాన్వాయ్‌పై రాళ్ల దాడి..

చింతలపేట కాలనీలో పెద్ద ఎత్తున్న కాన్వాయ్‌ను అడ్డగించి నిరసన వ్యక్తం చేస్తూ మంత్రి గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ కారు ముందు బైఠాయించారు. నిరసన కారులను పోలీసులు అదుపు చేయడం తీవ్ర సమస్యగా మారింది. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు మంత్రి కారుపై రాళ్లు విసిరారు. కాగా అద్దంపై చిన్న క్రాక్ మాత్రమే వచ్చింది. ఈ ఘటనపై ఎస్పీ శ్రీనివాసరావు ఆరాతీశారు. మంత్రి పర్యటన, అల్లర్లపై నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.



కారుపై దాడి చేసిన రాళ్లు

కార్యకర్తలకు అన్యాయం చేస్తే సహించం



కార్యకర్తలకు నచ్చజెప్పతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

గద్వాలలో కష్టపడి కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన ప్రతి కార్యకర్తకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేస్తానన్న నమ్మకం, భరోసా చాలా సందర్భాల్లో సీఎం కల్పించారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. కొత్తగా వచ్చిన వారు ఎవరైనా మీకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. నా ఈ మౌనం మీకు అన్యాయం జరగనంత వరకు మాత్రమే ఉంటుందని, అన్యాయం జరిగితే కచ్చితంగా నోరు విప్పుతానన్నారు. మన బాధ్యత మంత్రి జూపల్లి తీసుకున్నారని, అభివృద్ధి కోసం మంత్రి గద్వాలకు వచ్చారని, నిరసనలు వద్దని నచ్చజెప్పారు. ఎమ్మెల్యే మన కాంగ్రెస్ పార్టీలో చేరారని, దీనిని ఎవరూ వ్యతిరేకించొద్దని కోరారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయమనండి.. మనం కూడా కలుపుకొని వెళ్దామని పేర్కొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎస్పీ యోగేష్ గౌతమ్
- జాబ్‌మేళాకు విశేష స్పందన.. 1800 మంది హాజరు

కోస్గి: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. శనివారం కోస్గి కేంద్రంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతియువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కొడంగల్ నియోజకవర్గంతో కలిపి ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో మొత్తం 56 ప్రముఖ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించగా 1800 ల మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు ఎస్పీ కంపెనీల ప్రతినిధులతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పంచాక్షరీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ నివారణ ఫౌండేషన్ సహకారంతో చేపట్టిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించడం హర్షనీయమన్నారు. చదివిన చదువులకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం లేదని నిరాశకు గురికాకుండా బయట ప్రపంచంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి ఉపాధిఅవకాలను చూసుకోవాలన్నారు. అంతకు ముందు జాబ్ మేళాను కంపెనీల హెచ్‌ఆర్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, సీఐ దస్రూ నాయక్, ఎస్‌ఐ బీవీ రమణతోపాటు ఆయ కంపెనీల హెచ్‌ఆర్‌లు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

పీజీ, బీఈడీ, బీఫార్మసీ పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 19న నిర్వహించే పీజీ, బీఈడీ, బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షలను రాఖీ పండగ నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జరిగే పరీక్షలకు, పరీక్ష కేంద్రాలు, సమయాల్లో ఎలాంటి మార్పులు లేవని, 19న వాయిదా పడిన పరీక్షల తేదీల వివరాల కోసం పీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఓటర్ జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి



తహసీల్దార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ, ఆదాయ, కుల ధ్రువపత్రాల జారీ, ధరణి పెండింగ్ దరఖాస్తులు, సీఎం ప్రజావాణి, లోకల్ ప్రజావాణి అంశాలపై శనివారం కలెక్టరేట్ అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష జరిపారు. గ్రామాల వారీగా బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి, ఏ ఇంట్లోనైనా ఎక్కువ ఓటర్లు ఉండి, పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటే సరిచేసి అందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఈనెల 28 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని, అంతలోపు సర్వేకు బిఎల్ఓ లను సంసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ధ్రువపత్రాల జారీలో తప్పులకు తావివ్వొద్దు

పదో తరగతి విద్యార్థులకు ఇచ్చే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ చేసే విషయంలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని సూచించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. లోకల్ ప్రజావాణి ద్వారా వచ్చిన 174 దరఖాస్తులలో 84 పెండింగ్‌లో ఉన్నాయని, సీఎం ప్రజావాణి నుంచి 170 దరఖాస్తులు రాగా 80 ప్రాసెస్‌లో ఉన్నాయని, మిగతా 90 పెండింగ్‌లో ఉన్నాయని, ఈ రెండు మూడు రోజులలో దరఖాస్తులన్నీ క్లియర్ చేయాలని ఆదేశించారు. అంతకుముందు సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేలో ఇంటి నెంబర్లు, పేర్లను సరిచూసుకోవాలన్నారు. సమీక్షలో జిల్లాలోని తహసీల్దారులు పాల్గొన్నారు.

పోడు భూములు సాగు చేస్తున్న వారికి న్యాయం చేస్తాం..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పోడు భూముల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ సిక్తాపట్నాయక్ వివరించారు. పోడు భూముల పంపిణీకి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం మంత్రి కొండా సురేఖ కలెక్టర్లతో వీసీలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోడు భూముల్లో సుదీర్ఘ కాలం పాటు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న వారిని గుర్తించి వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

క్లుప్తంగా

నాలుగుకు చేరిన మృతులు

- జాతీయ రహదారిపై ఈ నెల 15న ఉండవెల్లిలో రోడ్డు ప్రమాదం



అనిత(ఫైల్)

అలంపూర్ : ఆటో ప్రమాదానికి సంబంధించిన విషాదం బాధిత కుటుంబాలను మరింత వేధిస్తోంది. ఘటనకు సంబంధించి చికిత్స పొందుతూ మరో మహిళా కూలీ మృతిచెందారు. దీంతో కూలీల ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. ఈ నెల 15న ఉండవెల్లి స్టేజీ సమీపంలోని 44వ జాతీయరహదారిపై కూలీలతో వెళ్తున్న ఆటోను అదే మార్గంలో వస్తున్న భారీ లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తెలుగు అనిత(33)ను కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. కాగా ఆమెది కర్నూల్ జిల్లా ఈ–తాండ్రపాడుగా పేర్కొన్నారు. కాగా గ్రామంలోని టీజీ భరత్ నగర్‌కు చెందిన దాదాపు 20 మంది కూలీలు కంచుపాడులో పొలంలో పని చేయడానికి వెళ్తున్న క్రమంలోనే ఈ ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కాగా లక్ష్మీదేవి(58) అనే మహిళా అక్కడికక్కడే మృతి చెందగా.. 19 మంది కూలీలను కర్నూల్ ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. అయితే చికిత్స పొందుతూ అదే రోజు రమాదేవి అలియాస్ సుజాత మృతి చెందగా.. ఈ నెల 16న చికిత్స పొందుతూ ప్రియాంక అనే యువతి మృతి చెందింది. తాజాగా అనిత కన్నుమూశారు. వీరంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఊట్కూరు: పురుగు మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్కూరుకు చెందిన ఈడెమ్ముల లక్ష్మి(45) ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ.. శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. కుమార్తె అంబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతురాలికి భర్త మల్లప్ప, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పడంతో..

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. బిజినేపల్లి మండలం వెలుగొండకు చెందిన తుంగం స్వామి(33) మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా కొప్పెట స్టేజీ సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. బలమైన గాయాలు కావడంతో రోడ్డుపై వెళ్తున్న వాహన దారులు గమనించి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి బలి

అమ్రాబాద్: పిడుగుపాటుకు గురై పశువుల కాపరి మృతిచెందిన ఘటన పదర మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పదరకు చెందిన కొయ్యల చిన్నలింగయ్య (55) తన పశువులను మేపేందుకు సమీపంలోని నక్కలగుట్ట అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లిన అతడు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య బాల్‌చంద్రమ్మ, కుమారులు విష్ణు, అంజి, కూతురు పద్మ ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు పదర కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామలింగయ్య యాదవ్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

లింగాల: మండలంలోని రాంపూర్‌కు చెందిన అతినారపు తిరుపతయ్య (50) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలిలా.. తన ఖర్చులకు భార్యాపిల్లలు డబ్బులు ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన అతడు ఈ నెల 16న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

స్వయం సమృద్ధి



మహిళలు తయారు చేసిన నగలు, హ్యాండ్ కఫ్

ఆర్టిఫిషియల్ జ్యువెలరీ తయారీలో మహిళలకు శిక్షణ

- జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడున్నర నెలల శిబిరం
- టైలరింగ్, బ్యూటీషియన్‌లోనూ ప్రావీణ్యం పొందుతున్న 120 మంది

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన జనశిక్షణ సంస్థాన్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నిమ్మబావిగడ్డ ఫిరోజ్‌నగర్‌లో మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యువెలరీ తయారీలో శిక్షణ ఇస్తున్నారు. మహిళా సాధికారతలో భాగంగా ఆర్థిక స్వావలంబన చేకూరేలా మూడున్నర నెలలపాటు కొనసాగే శిక్షణ.. ఇప్పటికే రెండు నెలలు పూర్తిచేసుకుంది. స్వయం సహాయక మహిళా సంఘాల సహకారంతో ఆసక్తిగల 120 మందిని ఎంపిక చేసి, జ్యువెలరీ తయారీతో పాటు టైలరింగ్ బ్యూటీషియన్ కోర్సుల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి, అన్ని రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు జ్యువెలరీ తయారీలో ప్రావీణ్యం పొందుతున్నారు. సంస్థాన్‌కు చెందిన సీనియర్ రిసోర్స్‌పర్సన్ అలియా సుల్తానాతో పాటు అమ్రీన్, సౌమ్య జ్యువెల్లరీ తయారీలో తర్ఫీదునిస్తున్నారు.

ఆకర్షణీయంగా..

శిక్షణలో భాగంగా ముత్యాలు, పచ్చలు, రంగురంగుల రాళ్లతో బ్యాంగిల్స్, ఇయర్ రింగ్స్, బ్రైడల్ సెట్, పాపిట బిళ్లలు, జుంకాలు, ఫింగర్ రింగ్స్, బ్రాస్‌లెట్స్, నోస్‌పిన్స్, మెడలో వేసుకునే చొకర్లు, నెక్లెస్, సాధారణ చైన్స్ ఆకర్షణీయంగా తయారు చేసేలా శిక్షణ కొనసాగుతోంది. ఇప్పటికే కొందరు మహిళలు నగల తయారీలో తర్ఫీదు పొంది సొంతంగా చేసుకుంటున్నారు. దుకాణాల్లో లభించే ధరలతో పోలిస్తే 50 శాతం తక్కువకే ఐటమ్స్ తయారు చేస్తున్నారు. అదనంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లోనూ శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం జనశిక్షణ సంస్థాన్ నుంచి సర్టిఫికెట్ అందించనున్నారు. తద్వారా బ్యాంకు రుణాలు పొందేందుకు వెసులుబాటు కలుగుతుంది.

సంతోషంగా ఉంది..



ప్రస్తుతం బంగారం నగలు చేయించుకునే పరిస్థితి లేదు. అందుకే ఆర్టిఫిషియల్ జ్యువెల్లరీ తయారీ నేర్చుకున్నా. ఇందుకు రెండు నెలలపాటు శిక్షణ తీసుకున్నా. నగల తయారీతో పాటు టైలరింగ్ నేర్చుకోవడం సంతోషంగా ఉంది. ఇంట్లో వాళ్ల బట్టలు కుట్టుకున్నా ఖర్చు మిగులుతుంది.

– సుజాత, గృహిణి

మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటది..



ఇంట్లో ఖాళీగా కూర్చునే బదులు జ్యువెల్లరీ నేర్చుకుందామని వచ్చాం. మా ఇళ్లలో పెళ్లి ఇతర శుభ కార్యాలు అయితే హైదరాబాద్ వెళ్లి నగలు తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడా అవసరం లేదు. మేమే స్వయంగా తయారు చేసుకోగలం. ప్రభుత్వం మాకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– హసీనా, గృహిణి

నా నగలు నేనే తయారు చేసుకుంటున్నా..



రెండు నెలలపాటు శిక్షణ పొందాను. ప్రస్తుతం నా నగలు నేనే తయారు చేసుకుంటున్నా. బయట షాప్‌లో కన్నా సగం ధరలోనే కావాల్సిన డిజైన్‌లో నగలు చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. శిక్షణ అయిపోయాక మా అందరికి నగల తయారి కేంద్రం పెట్టి ప్రభుత్వం మార్కెటింగ్ కల్పిస్తే బాగుంటుంది.

– శ్రావ్య,

మహిళా సంఘాల సమావేశాల్లో ప్రదర్శనలు..

మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకునే నాటికి తయారుచేసిన ఆభరణాలను స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశాల్లో ప్రదర్శించేందుకు సిద్ధం చేస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఇతర అన్ని ప్రత్యేక రోజులు, పండగల కోసం అవసరమైన జ్యువెలరీ తయారీ చేసేలా తర్ఫీదు ఇస్తున్నారు.

మొదటి బ్యాచ్‌లోనే మంచి స్పందన..



మొదటి బ్యాచ్‌కే మంచి స్పందన వస్తుంది. 120 మంది మహిళలు శిక్షణ తీసుకుంటూ, రెండు నెలల్లోనే నగల తయారీ చేస్తున్నారు. సమయం వృథా కాకుండా ఉండేందుకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు సైతం నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తయ్యాక అందించే సర్టిఫికెట్‌తో బ్యాంకుల్లో స్త్రీనిధి, ముద్ర రుణాలు పొందవచ్చు. ప్రస్తుతం నగల తయారీకి అవసరమయ్యే ధారాలు, నైలాన్, ముత్యాలు ఇతర వస్తువులన్నీ మేమే అందిస్తున్నాం.

– అలియా సుల్తానా, సీనియర్ ఆర్పీ, జనశిక్షణ సంస్థ, మహబూబ్‌నగర్

ప్రకృతి రాఖీలు



అన్నా చెల్లెళ్ల అనురాగానికి.. అక్కా తమ్ముల్ల ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సమయంలో రాఖీ పూలు కనువిందు చేస్తాయి. తీగ జాతికి చెందిన ఈ మొక్కలకు రాఖీని పోలిన పూలు పూస్తాయి. కాగా.. మహబూబ్‌నగర్ శివారులోని మౌంట్ బాసిల్ పాఠశాల గార్డెన్స్‌లో విరబూసిన ఈ పుష్పాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పూల ప్రత్యేకతను ప్రిన్సిపాల్ సోమశేఖర్ వివరించారు. ఇదివరకు ప్రకృతి సిద్ధంగా పూచే ఈ పూలనే రాఖీలుగా కట్టేవారని.. ఇప్పుడు వాటి స్థానంలో ప్లాస్టిక్, కాగితం పూలను కడుతున్నారని పేర్కొన్నారు. ఈ పువ్వుపై భాగంలో ఐదు కేసరాలు.. దాని చుట్టూ వంద వరకు చిన్నచిన్న పత్రాలు ఉండడం వల్ల ఈ పుష్పాన్ని పాండవ కౌరవపూలు అని కూడా పిలుస్తారని చెప్పారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

ఫోన్ ఇస్తే.. డబ్బులు స్వాహా

- బియ్యం ధర చెబుతానని వ్యాపారీతో ఫోన్ తీసుకుని మాట్లాడి..
- వెంటనే అక్కడి నుంచి పరారైన యువకుడు
- వ్యాపారీ బ్యాంకు ఖాతా నుంచి రూ.99 వేలు మాయం
- సైబర్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు



జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సైబర్ క్రైంకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు కరుణాకర్

జడ్చర్ల: రోజుకు సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సైబర్ మోసాలకు సంబంధించి వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నారు. గతంలో ఆధార్, బ్యాంకు ఖాతాలు, పిన్ నంబర్లు తెలుసుకుని మోసం చేయడం, మెసెజ్‌ల రూపంలో లింక్‌లను పంపి లింక్‌లు ఓపెన్ చేస్తే ఖాతాల నుంచి సొమ్ము కాజేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. శనివారం కేవలం ఓ వ్యాపారుస్తుడి నుంచి ఫోన్‌ను అడిగి ఇప్పించుకుని, తనకు కావాల్సిన వ్యక్తికి ఒక ఫోన్ కాల్ మాట్లాడి తిరిగి వ్యాపారీకి ఫోన్ ఇచ్చిన సమయంలోనే ఫోన్ ఇచ్చిన వ్యాపారీ బ్యాంకు ఖాతా నుంచి రూ.99 వేలు అపహరించిన సంఘటన జడ్చర్లలో చోటుచేసుకుంది. బాధితుడు కండె కరుణాకర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాదేపల్లి మార్కెట్‌యార్డు సమీపంలో కరుణాకర్ బియ్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి తనకు 2 క్వింటాళ్ల బియ్యం కావాలని, ధర ఎంతో చెప్పాలని కోరాడు. దీంతో వ్యాపారీ క్వింటాలు బియ్యం ధర ఎంతో చెప్పాడు. గుర్తుతెలియని వ్యక్తి తన దగ్గర ఫోన్ లేదని, తనకు సంబంధించిన వ్యక్తికి బియ్యం ధర చెప్పి ఇస్తానంటూ వ్యాపారీ నుంచి ఫోన్ తీసుకుని 99588 72636 నంబర్‌కు కాల్ చేసి ఫోన్ మాట్లాడాడు. వెంటనే ఇచ్చేసి మళ్లీ వస్తానంటూ వెళ్లిపోయాడు. వెంటనే వ్యాపారీ బ్యాంకు ఖాతా నుంచి రూ.99వేలు కట్ అయినట్లు మెసెజ్ వచ్చింది. దీంతో వ్యాపారీ వెంటనే బ్యాంక్‌కు చేరుకుని తన ఖాతాను పరిశీలించగా.. ఖాతాలో రూ.99 వేలు బదిలీ అయినట్లు బ్యాంకు అధికారులు తెలియజేశారు. వెంటనే తన బ్యాంకు ఖాతాను నిలిపివేయించి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కేవలం అవతలి వ్యక్తితో ఫోన్ మాట్లాడి బియ్యం ధర చెబుతాడని అనుకున్నానని, అంతలోనే తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు అపహరిస్తాడని ఊహించలేకపోయినట్లు బాధితుడు వాపోయాడు.

రైతుల పొలాల్లో దొంగలు



నెట్టెంపాడు కాల్వ వద్ద రైతుల స్టార్టర్ల వద్ద కేబుల్ వైరును కట్ చేసి ఎత్తుకెళ్లి దొంగలు

- నెట్టెంపాడు కాల్వ వెంట 40 మంది రైతుల మోటార్ల కేబుల్ వైరును కట్ చేసి ఎత్తుకెళ్లిన దుండగులు

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రధాన కాల్వ వెంట రైతుల వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైరు ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. ప్రతిఏటా రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో రైతుల స్టార్టర్ల వద్ద నుంచి మోటార్ల వరకు వెళ్లిన రాగితో కూడిన కేబుల్‌ను ఎత్తుకెళ్తున్న సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారుతోంది. గుర్తుతెలియని దుండగులు రైతులను టార్గెట్ చేసి రాత్రికి రాత్రే కరెంటు కేబుల్ వైరును ఎత్తుకెళ్తున్నారు. జాంపల్లి గ్రామ శివారు నుంచి దోర్నాట బాట వరకు శుక్రవారం రాత్రి 40 మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైరును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఎత్తుకెళ్లి వైరు విలువ దాదాపు రూ. 1.60లక్షల విలువ ఉంటుందని రైతులు తెలియజేశారు. ప్రతి పంటకు ఇలా నష్టం వాటిల్లే పనిచేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా.. మండలంలో పోలీసు యంత్రాంగం వారిని పట్టుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. రాత్రికి రాత్రే ఈ కేబుల్ వైరును కాల్చి, అందులోని రాగి వైరును అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాఖీ పండుగకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



లిఖితారెడ్డి మృతదేహం

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూగుల్‌కి చెందిన ఓ మహిళా ఉద్యోగి అక్కడికక్కడే దుర్మరణం చెందగా పురుష ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. కోదండాపురం ఎస్‌ఐ స్వాతి కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లాలోని నంద్యాలకు చెందిన లిఖితారెడ్డి (23), అదే జిల్లాలోని జి.సింగవరంకు చెందిన తరుణ్ కుమార్ హైదరాబాద్‌లో గూగుల్ కంపెనీలో పనిచేస్తున్నారు. రాఖీ సెలవుల నిమిత్తం ఇరువురు ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామాలకు బయలు దేరారు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై కోదండాపురం సబ్‌స్టేషన్ సమీపంలో మార్బుల్ లోడ్‌తో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను అతివేగంగా వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో లిఖితారెడ్డి తలకు తీవ్ర రక్త గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందారు. హెల్మెట్ ధరించిన నేపథ్యంలో తరుణ్‌కుమార్‌కు తీవ్రగాయాలైనప్పటికీ ప్రాణాలతో బయటపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లిఖితారెడ్డి తండ్రి రాజగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా హెల్మెట్ లేకపోవడంతోనే లిఖితారెడ్డి ప్రాణాలు కోల్పోయిందని.. అతివేగమే ప్రమాదానికి కారణమని ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఇతర ప్రయాణికులు పేర్కొన్నారు.

హైవేపై కంటైనర్ బోల్తా : నిలిచిన వాహనాలు



కంటైనర్‌ను రోడ్డుపై నుంచి తొలగిస్తున్న క్రేన్

రాజాపూర్: మండల పరిధిలోని జాతీయ రహదారిపై శనివారం ఓ కంటైనర్ బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు ఇనుప షీట్స్‌తో సదరు కంటైనర్ వెళ్తోంది. కాగా ఆ సమయంలో దాని ముందు వెళ్తున్న ఓ కారులో వెళ్తున్న వ్యక్తికి కళ్లు తిరిగాయి. దీంతో కారును సడన్‌గా హైవేలో కుడిపైపునకు ఆపారు. కాగా వెనుకాలే వస్తున్న కంటైనర్ డ్రైవర్ గుర్తించి కారును తప్పించబోయాడు. దీంతో అది కాస్తా కారుకు తగులుతూ అదుపుతప్పి డివైడర్‌ను దాటి హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో ఆ దారిలో వెళ్తున్న రెండుకార్లు కొద్దిలో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగాయి. కంటైనర్ పడుతున్న విషయాన్ని కళ్లారా చూసిన రాయపల్లి శ్రీకాంత్‌గౌడ్ తన కారు కొద్ది సెకన్లు ఆగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని తెలిపారు. ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజాపూర్ ఎస్‌ఐ రవి సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఘటనలో కారు, కంటైనర్ డ్రైవర్లకు రక్త గాయాలు కావడంతో రాజాపూర్‌కు పంపించి చికిత్స చేయించారు. అయితే అప్పటికే రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కాగా కంటైనర్‌ను భారీ క్రేన్‌తో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మొదట రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో వన్‌వేలో డివైడర్లు పెట్టి రోడ్డును క్లియర్ చేశారు. కారు డ్రైవర్, కంటైనర్ డ్రైవర్ సీటు బెల్ట్ పెట్టుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారని ఎస్‌ఐ తెలిపారు.

దుకాణంలో నగదు చోరీ

జడ్చర్ల: దుకాణంలో కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు యజమానిని మభ్యపెట్టి కౌంటర్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. యజమాని దిలిప్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న పీఎస్‌పీ మార్బుల్, టైల్స్ దుకాణంలో ప్లంబర్ సామగ్రి కొనుగోలు కోసం శనివారం రాత్రి ఇద్దరు వచ్చారు. పలు రకాల సామానుకు సంబంధించి యజమానిని అడిగి తెలుసుకుంటూ వాటిని చూపించాలని కోరగా ఆయన సామగ్రి తెచ్చేందుకు కౌంటర్‌ను వదలి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో కౌంటర్‌లో ఉన్న బ్యాగును అపహరించారు. బ్యాగులో రూ.70 వేల నగదును తీసుకెళ్లి బ్యాగును పక్కనే ఉన్న ట్యాంకులో పడేశారు. ప్లంబర్‌ను తీసుకుని మళ్లీ వస్తామంటూ యజమానికి చెప్పి వెళ్లిపోయారు. వారు వెళ్లిన తర్వాత అనుమానంతో కౌంటర్‌లోని బ్యాగును చూసుకోగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతకగా బయట పెట్టిన ట్యాంకులో బ్యాగు కనిపించింది. అందులో ఉన్న డబ్బు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డీసీఎంలో సోదాలు



జడ్చర్ల: నిబంధనలకు విరుద్ధంగా రాగి తీగలను తరలిస్తున్నారన్న సమాచారంతో.. జడ్చర్ల వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఓ డీసీఎంను స్థానిక కార్యాలయం వద్దకు తరలించి సోదాలు నిర్వహించారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్లలో పాత ఇనుప సామగ్రి సేకరించిన వ్యాపారి డీసీఎంలో లోడ్ చేసి వాటితో పాటు రాగి తీగలను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తుతెలియని వ్యక్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు తనిఖీలు చేపట్టారు. కాగా వాహనంలో పాత ఇనుప సామగ్రి, దానికి సంబంధించిన విలువకు తగిన విధంగా జీఎస్టీ కట్టినట్లు సదరు వ్యాపారి బిల్లులు చూపించడంతో విడుదల చేసినట్లు ఏసీటీఓ వెంకట్రామరెడ్డి తెలిపారు. వాహనంలో ఎలాంటి రాగి తీగలు లభించలేదన్నారు.

పిడుగుపాటుకు 24 మేకలు మృతి

- రూ.3 లక్షల ఆస్తి నష్టం



పిడుగుపాటుకు మృతిచెంది చెల్లాచెదురుగా పడిపోయిన మేకలు

అమ్రాబాద్: పిడుగుపాటుకు 24 మేకలు మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని బీకే తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్లశ్రీశైలం తన మేకలను మేత కోసం అటవీ సమీపంలోని ఏడెల్లిచేను ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో మేకలు సమీపంలోని చెట్ల కిందకు వెళ్లాయి. అదే సమయంలో చెట్లపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మేకలు మృతిచెందాయి. వాటి విలువ దాదాపుగా రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం బాధిత మేకల కాపరికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తోటి రైతులు, మేకల కాపరులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



చిన్నచింతకుంట పరిధిలో పట్టుబడిన బియ్యం

కేటీదొడ్డి: కర్ణాటకలోని రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని తెల్లవారు 5 గంటల సమయంలో కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు శనివారం ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షరీఫ్, వీరేంద్ర, రవి వివిధ గ్రామాల నుంచి 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి రాయిచూర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈమేరకు వాహనాల తనిఖీలు చేస్తుండగా నందిన్నె శివారులో బియ్యం పట్టుబడ్డట్లు వివరించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. షరీఫ్, వీరేంద్ర, రవిలపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చిన్నచింతకుంట: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన రాంచంద్రి అప్పంపల్లిలో లబ్ధిదారుల నుంచి రేషన్ తక్కువ రేటుకు కొనుగోలు చేసి గ్రామంలోని ఓ ఇంటిలో నిల్వ ఉంచాడు. విషయంపై సమాచారం అందడంతో పోలీసులు శనివారం బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన అనంతరం డీటీ ఆదిత్యగౌడ్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ శేఖర్ వివరించారు. 25 బ్యాగులలో మొత్తం 9.5 క్వింటాళ్ల బియం ఉన్నట్లు పేర్కొన్నారు.

వైన్ షాపు వద్ద ఘర్షణ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని వైన్ షాపు వద్ద శనివారం సాయంత్రం గొడవ జరిగింది. స్థానిక బంగ్లగడ్డకు చెందిన నలుగురు యువకులు వైన్ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం సేవించే క్రమంలో షాపు నిర్వాహకులు, యువకుల మధ్య గొడవ మొదలైంది. దీంతో వైన్ షాపు నిర్వాహకులు యువకులపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. బాధితుల్లో ఒకరు 100కు డయల్ చేయడంతో స్థానిక పోలీసులు వాహనంలో అక్కడికి చేరుకుని గొడవను అడ్డుకున్నారు. నలుగురిని స్టేషన్‌కు తరలించారు. దాడి చేసిన వారు కూడా మద్యం మత్తులో ఉన్నట్లు బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులను సంప్రదించగా దాడి జరిగినట్లు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. మద్యం మత్తులో ఉన్న వారికి జరిమానాలు వేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా...

వైద్యుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి



సాక్షి, హైదరాబాద్: దేశంలో వైద్యుల భద్రత దృష్ట్యా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి వైద్యులకు భద్రత కల్పించాలని సూచించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ చికిత్స పొందుతూ రోగులు చనిపోతే.. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రులపై దాడులు చేయడం సబబు కాదన్నారు. కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైద్య, ఆరోగ్య శాఖలో 3 కొత్త హెచ్‌వోడీ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో ఇన్‌చార్జుల వ్యవస్థకు స్వస్తి పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ శాఖ పరిధిలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ మూడు పోస్టులను మంజూరు చేయకపోవడంతో పదేళ్ల పాటు ఈ పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇన్‌చార్జులుగానే కొనసాగారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జారీ చేసిన తాజా ఉత్తర్వులతో రెగ్యులర్ హెచ్‌వోడీలు రానున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- భట్టి, పొన్నంను కలిసిన ఆర్టీసీ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు అమలు చేస్తూ మాస్టర్ స్కేల్ ఇవ్వాలని, దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ కోరింది. ఈ మేరకు శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి, మౌలానా, యాదయ్య, సురేశ్, యాదిగిరి తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని కోరారు.



మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద యువ డాక్టర్ హత్యాచార ఘటనపై దృశ్య రూపకంలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు రాఖీ కడుతున్న రిమ్స్ జూనియర్ వైద్యులు



వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఎదుట రక్తపు చేతి మరకలు ఉన్న డాక్టర్ ఆప్రాన్‌ను చూపుతూ నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

రాష్ట్రమంతా ఓపీ బంద్

ఐఎంఏ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద వైద్యుల ఆందోళన • రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన

సాక్షి నెట్‌వర్క్: కోల్‌కతాలో యువ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలు నిలిచిపోయాయి. మెడికల్ కాలేజీలు, జిల్లా కేంద్రాల్లో పలు రూపాల్లో డాక్టర్లు, వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేశారు. పెద్దఎత్తున డాక్టర్లు, వైద్య సిబ్బంది, రాజకీయనేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ తాను ఒక ఎంపీగా ఇక్కడకు రాలేదని ఓ వైద్యురాలిగా తన కుటుంబంలో ఒకరిని కోల్పోయిన బాధతో ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని ఆమె డాక్టర్లకు హామీ ఇచ్చారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని బహిరంగంగా ఉరి తీసినా తప్పు లేదన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.కాళీప్రసాదరావు మాట్లాడుతూ డాక్టర్లకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలతోపాటు భద్రత కల్పించాలన్నారు. అనేక చట్టాలు ఉన్నా, వాటి అమలు తీరు సరిగ్గా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. చట్టాల పటిష్ఠ అమలుతోనే ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రధానకార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు, ఫైనాన్స్ సెక్రటరీ ఆర్కే.యాదవ్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ దయాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఓపీ మినహా అన్ని రకాల వైద్య సేవలు నిలిచిపోవడంతో వేలాది మంది రోగులు ఇబ్బందులు పడ్డారు. అసలే రోగాల సీజన్ కావడంతో ఓపీకి వచ్చిన వారంతా డాక్టర్ల కోసం ఎదురుచూశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట వైద్యుల ధర్నా

వైద్యులు, వైద్య విద్యార్థులు కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. జిల్లా వైద్యులు డాక్టర్ బీఎన్.రావు, రఘురామన్, విజయ్ మోహన్‌రెడ్డి, రమణాచారి, చల్మెడ, ప్రతిమ మెడికల్ కళాశాల డాక్టర్లు, పీజీ డాక్టర్లు పాల్గొన్నారు.

పాలమూరులో భారీ ర్యాలీ

ఐఎంఏ, ప్రభుత్వ జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు.

ఆదిలాబాద్ కలెక్టర్‌కు రాఖీ కట్టిన రిమ్స్ జూడాలు

ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ వైద్యులు కలెక్టర్ రాజర్షి షాకు రాఖీలు కట్టి రక్షణ కల్పించాలన్నారు.

వరంగల్‌లో నిరసన వెల్లువ

వరంగల్‌లో వైద్యులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. జూనియర్ వైద్యులు ఓ పక్క విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న క్రమంలో వారికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నర్సింగ్ విద్యార్థులు వివిధ పార్టీలు మద్దతు తెలిపాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేఎంసీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు.

తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ సాధ్యం కాదు

- వీసీ ఘోష్ కమిషన్‌కు వి.ప్రకాశ్ వివరణ
- వెదిరె శ్రీరామ్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాంకేతికంగా సాధ్యం కాదని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను తుమ్మిడిహెట్టి కోణంలో కాకుండా మూడు తరాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికే ప్రాజెక్టును కేసీఆర్ రీడిజైన్ చేశారనే కోణంలో నిర్వహించాలని కోరారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట శనివారం ఆయన స్వచ్ఛందంగా హాజరై తన వాదనలను వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ కడితే 5 టీఎంసీల నీళ్లు నిల్వ చేసుకోవచ్చని, అయితే మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుతో కట్టడానికి మాత్రమే అంగీకారం తెలపడంతో 1.8 టీఎంసీలకు మించి నిల్వ చేసుకోవడానికి వీలు ఉండదని ప్రకాశ్ చెప్పారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉంటే అందులో ఎగువ రాష్ట్రాలు వాడుకోని 63 టీఎంసీలూ ఉన్నాయన్నారు. ఈ విషయంలో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ కమిషన్‌ను తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు.

'వీ'ఆకృతిలో బరాజ్ ఎక్కడా లేదు

తుమ్మిడిహెట్టి వద్ద నిర్మిస్తే వార్ధా-వెన్‌గంగా నదులు కలిసే చోట 'వీ'ఆకృతిలో బరాజ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడా 'వీ'ఆకృతిలో బరాజ్ లేదని స్పష్టం చేశారు. ప్రతిపాదిత స్థలంలో చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాంతం ఉందని, రూ.7,500 కోట్లు వెచ్చించినా తుమ్మిడిహెట్టితో ఆశించిన ప్రయోజనం ఉండదని చెప్పారు. నిజాం హయాంలో తెలంగాణ ప్రాంతంలో 9 ప్రాజెక్టులు ప్రతిపాదించగా, అప్పటి సీఎం నీలం సంజీవరెడ్డి చొరవతో అందులో సాగర్, శ్రీరాంసాగర్‌లను మాత్రమే నిర్మాణం చేపట్టారని, అవి కూడా అసంపూర్తిగా కట్టారని తెలిపారు. 57 ఏళ్లలో తెలంగాణ నాశనం అయిందని, ఈ కారణంగానే జలయజ్ఞం ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టినట్టు వివరించారు. కాగా బరాజ్ కుంగడానికి కారణాలను తెలుపుతూ ఈ నెల 26లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఆదేశించగా 28న సాక్ష్యాధారాలతో సహా నివేదిక ఇస్తానని ప్రకాశ్ వెల్లడించారు.

త్వరలో మాజీ ప్రజాప్రతినిధులకు నోటీసులు

- కాళేశ్వరం బరాజ్‌లపై తుది అంకానికి విచారణ
- ముఖ్య నేత ఇంటికి వెళ్లి విచారించే యోచన!



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై విచారణ చివరి అంకానికి చేరడంతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మాజీ ప్రజాప్రతినిధులకు త్వరలో నోటీసులు జారీ చేయనుంది. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారుల నుంచి వాంగ్మూలంతో పాటు అఫిడవిట్లను స్వీకరించి పరిశీలించింది. ఈ అఫిడవిట్లలో ఉన్న సమాచారం ఆధారంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ముఖ్యులకు నోటీసులు జారీ చేసి విచారించాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలిసింది. గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయకుండా కమిషన్ ఆదేశాలను ధిక్కరించిన ఓ మాజీ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి విచారణకు తాజాగా సమన్లు జారీ చేయాలని కూడా నిర్ణయించింది. కాగా మాజీ ముఖ్యనేత ఒకరు అనారోగ్యంతో ఉన్నారని, విచారణకు హాజరుకాలేరని బీఆర్ఎస్ నేత ఒకరు కమిషన్‌కు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. అయితే ఒకవేళ సమన్లు జారీ చేసినా, విచారణకు రానిపక్షంలో కమిషన్ స్వయంగా ఆ నేత నివాసానికి వెళ్లి విచారించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇలావుండగా సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను వచ్చే వారం నుంచి కమిషన్ ప్రారంభించనుంది. 57 మంది సాక్షులు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. ఈ ప్రక్రియలో కమిషన్‌కు సహకరించేందుకు తెలంగాణ, ఏపీ, పశ్చిమబెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదిని నియమించాలని కమిషన్ ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరింది. క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆర్థిక అవకతవకలపై కమిషన్ దృష్టి సారించనుంది.

మళ్లీ గడువు పొడిగింపు!

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు నెలాఖరుతో ముగియనుంది. అయితే విచారణ ప్రక్రియ ఇంకా కొలిక్కిరాకపోవడంతో ప్రభుత్వం మళ్లీ రెండు నెలలు గడువు పొడిగించే అవకాశాలున్నాయి.

న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



పాలమూరు: గ్రామాల్లో న్యాయ సదస్సులు ఏర్పాటు చేసి అన్నిరకాల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పారా లీగల్ వలంటీర్లపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. న్యాయ సేవా భవన్‌లో శనివారం ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. జిల్లాలోని అన్ని రకాల గ్రామ పంచాయతీలో ప్రతినెల ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేసి న్యాయ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా లోక్ అదాలత్ వల్ల కలిగే లాభాలను కక్షిదారులకు తెలియజెప్పాలన్నారు. లోక్ అదాలత్‌లో ఒక్కసారి రాజీ అయితే శాశ్వత పరిష్కారం దొరికినట్లు అవుతుందనే విషయాన్ని అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు. సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

■ జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న స్టేట్ హోం, శిశుగృహను శనివారం నాలుగో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎంఎస్‌కే భావన సందర్శించారు. స్థానికంగా పిల్లలు, చిన్నారులకు అందుతున్న భోజన వసతి, తాగునీరు ఇతర సౌకర్యాలు పరిశీలించారు. చిన్నారులకు ఎలాంటి సదుపాయాలు అందిస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోరవి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. అనంతరం మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

9 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం జూరాల ప్రాజెక్టు 17,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం సాయంత్రానికి 30వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో95, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 731, ఎడమ కాల్వకు 920, కోయిల్‌సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 35,117 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.357 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.



విద్యుదుత్పత్తి కోసం జూరాల నుంచి వెళ్తున్న వరద

పుంజుకున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి పుంజుకుంది. శనివారం 9 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, దిగువలో 5 యూనిట్ల ద్వారా 200 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 124.166 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరకపోవడంతో ఉత్పత్తి చేపట్టలేకపోతున్నామని, ప్రస్తుతం 32వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని తెలిపారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు శనివారం ఎగువ నుంచి వస్తున్న నీటిని సామర్థ్యం మేరకు నిల్వ ఉంచుకుని, మిగతా నీటిని దిగువకు వదిలారు. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 62,820 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, 14 గేట్ల ద్వారా 60,354 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలారు.

శ్రీశైలంలో నీటిమట్టం 881.1 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 881.1 అడుగుల నీటిమట్టం, 193.8 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 60,354, జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,806 మొత్తం 92,160 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,681 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,303 మొత్తం 68,984 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 28వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,477 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.907 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.296 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

25, 26న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ



మాట్లాడుతున్న మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్

21న ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఈనెల 25, 26 తేదీల్లో అండర్-16 యూత్ అంతర్‌జిల్లా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ తెలిపారు. స్టేడియంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాకు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ కేటాయించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఏడేళ్ల క్రితం రాష్ట్రస్థాయి సీనియర్ టోర్నీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అండర్-16 రాష్ట్రస్థాయి టోర్నీలో రాష్ట్రంలోని 17 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని తెలిపారు. 500 మంది క్రీడాకారులు, 20 మంది అఫీషియల్స్ హాజరవుతారని చెప్పారు. అఫీషియల్స్‌కు ఇండోర్ స్టేడియంలో, క్రీడాకారులు ప్రైవేట్ స్కూళ్లలో వసతి కల్పిస్తామని వెల్లడించారు. అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియంలోని కోర్టుల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. కోల్‌కత్తాలో నవంబర్ 29 నుంచి జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ జట్లను ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రీడలశాఖ సలహాదారుడు ఏపీ.జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి హాజరవుతారని చెప్పారు. ఈ నెల 21న స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-16 బాస్కెట్‌బాల్ ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నసరుల్లా హైదర్, మీర్ అర్షద్ అలీ, సుబాన్‌జీ, మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ, ఖాలెద్ అలీ, కోచ్ ఎండి.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాంకు స్టాప్‌లాక్ గేటు బిగింపు

- ఆరు రోజులపాటు శ్రమించిన అధికారులు
- జోగుళాంబ జిల్లాలోని సుంకేసుల బ్యారేజీకి నిలిచిన వరద ప్రవాహం



టీబీ డ్యాం 19వ గేటును శనివారం రాత్రి అమర్చుతున్న ఇంజనీర్లు, నిపుణుల బృందం

శాంతినగర్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట సమీపంలోని తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం)లో ఊడిన 19వ గేటు స్థానంలో అధికారులు స్టాప్‌లాక్ బిగించారు. ఆరు రోజులపాటు అధికారులు, ఇంజనీర్లు శ్రమించి శనివారం విజయవంతంగా స్టాప్‌లాక్ గేటు అమర్చడంతో వృథా నీటికి అడ్డుకట్ట పడినట్లయింది. ఓవైపు డ్యాంలోని నీటిని 33 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తూనే.. మరోవైపు నిపుణుల బృందంతోపాటు నీటిపారుదల శాఖ ఇంజనీర్లు సమస్యను పరిష్కరించారు. మొదట రెండు ఎలిమెంట్లను అమర్చి మిగతా వాటిని నీటి ప్రవాహానికి అడ్డంగా అమర్చి వెల్డింగ్ చేస్తూ స్టాప్‌లాక్ గేటు అమర్చగలిగారు. శనివారం రాత్రి వరకు ఐదో ఎలిమెంట్‌ను విజయవంతంగా బిగించడంతో టీబీ డ్యాం నుంచి శనివారం నీటి విడుదల పూర్తిగా నిలిచిపోయింది.

71 టీఎంసీల నిల్వ

ఆరు రోజుల క్రితం టీబీ డ్యాం పూర్తిస్థాయి 105.788 టీఎంసీల నీటి నిల్వతో నిండుకుండను తలపించింది. డ్యాంకు ఇన్‌ఫ్లో ఎక్కువగా రావడంతో భద్రతా దృష్ట్యా అన్ని గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేసే క్రమంలో 19వ గేట్ లాక్ ఊడిపోయింది. దీంతో గేట్లన్నీ ఎత్తడంతో 34 టీఎంసీల నీరు వృథాగా పోయింది. ప్రస్తుతం 19వ గేటును తిరిగి బిగించడంతో 71 టీఎంసీల నీటిని నిల్వ ఉంచగలిగారు.

సుంకేసులకు తగ్గనున్న ఇన్‌ఫ్లో..

జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి సమీపంలో నిర్మించిన సుంకేసుల బ్యారేజీకి ఇన్‌ఫ్లో తగ్గుతుందని ఆర్డీఎస్ అధికారులు తెలిపారు. టీబీ డ్యాం నుండి 33 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో ఆరు రోజులపాటు ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఓవర్‌ఫ్లో కొనసాగుతూ సుంకేసులకు లక్షకు పైగా క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అయితే టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీటితో మనకు రావాల్సిన వాటా వచ్చే అవకాశం ఉందని ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటికీ ఎగువ నుంచి డ్యాంకు వరద వస్తుందని, దీంతో నీటి నిల్వ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

నందివడ్డెమాన్‌కు పోటెత్తిన భక్తులు



శనైశ్వరుడికి తిలతైలాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని నందివడ్డెమాన్ శనైశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి, జైష్ఠ్యాదేవి సమేత శనైశ్వరుడికి తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులచే గోత్ర నామార్చన, శని నివారణ పూజలు చేయించారు. అనంతరం భక్తులు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, పుల్లయ్య, అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్ పాల్గొన్నారు.

మన్యంకొండలో భక్తజన సందోహం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. శ్రావణమాసంలోని రెండో శనివారం పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే పక్కనే ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. మరికొంత మంది స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులంతా ఒక్కసారిగా తరలిరావడంతో మన్యంకొండ భక్తులతో కిటకిటలాడింది. మన్యంకొండ దిగువకొండ వద్దనున్న అలివేలు మంగాతాయారు దేవస్థానంలో కూడా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న హోమం..

మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం కూడా హోమం కొనసాగింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని దేవస్థానంలో ప్రతిరోజూ ఈ హోమంతో పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు అర్చకులు పాల్గొన్నారు.



మన్యంకొండ దేవస్థానంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు